సాక్షి నిర్మల్

ఆదివారం । 5 । నవంబర్ । 2023

ఓటుపై ఫ్లాష్‌మాబ్

ఎన్నికల్లో ప్రతీ పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని పట్టణాలు, పల్లెల్లో వంద శాతం ఓటింగ్ జరిగేలా దీక్ష కళాశాల విద్యార్థులు నిర్మల్‌లో సోమవారం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఓట్ ఫర్ ష్యూర్, ఓట్ ఫర్ బెటర్ సొసైటీ అనే నినాదాలతో ప్రజలకు తమ ఓటు విలువను తెలియజేశారు. – నిర్మల్‌చైన్‌గేట్



వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /21.2

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. స్థానిక పాలిటెక్నికల్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని శనివారం ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మూడు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాల గదులను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ మల్లేశ్, ఆర్‌అండ్‌బీ అధికారి అశోక్ ఉన్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించిన 'అల్లోల'



కొత్త ప్రభాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి

నిర్మల్‌టౌన్: సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుబ్బాక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శనివా రం పరామర్శించారు. ఆయనతో మాట్లాడి క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అయ్యప్ప భక్తులకు శుభవార్త

నిర్మల్‌టౌన్: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. నిర్మల్ ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు డీఎం ప్రతిమారెడ్డి తెలిపారు. ఈ బస్సుల్లో టీవీ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇద్దరు మణికంఠ స్వాములకు, ఇద్దరు వంట మనుషులకు, సామాన్లు సరిదిద్దేందుకు ఒక్కరికి ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. బస్ బుక్ చేసిన గురుస్వామి కూడా ఉచితంగా ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. అంతేకాకుండా ఒకటికంటే ఎక్కువ బస్సులు బుక్ చేస్తే ఆ గురుస్వామికి ఆ బస్సులపై రోజుకు రూ.300 చొప్పున కమీషన్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శబరిమలై వెళ్లే దారిలో పుణ్యక్షేత్రాలను దర్శించుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9959226003, 9492767879 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.


కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల ఏఐసీసీ పరిశీలకులు, ఏఐసీసీ క్లస్టర్ ఇన్‌చార్జీలను నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు పరిశీలకులను ప్రకటించింది. ఏఐసీసీ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా చెన్నూర్‌కు బి.దేవేంద్రప్ప, బెల్లంపల్లికి శ్రీనివాస్ ఎన్టీ, ఆసిఫాబాద్‌కు జీఎస్.గణేశ్, ఆదిలాబాద్‌కు ఆర్.రాజేంద్రను నియమిస్తూ ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

భైంసాటౌన్: పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని భైంసా కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణ సూచించారు. డివిజన్ పరిధిలోని పోలీ సు, ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నేరాలు, విచారణ, పెండింగ్ కేసులు, పరిశోధన తదితర అంశాలపై చర్చించారు. సంబంధిత కేసుల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ సీఐ ఎల్ శ్రీను, ఎఫ్ఆర్వో రమేశ్‌రాథోడ్, ఎక్సైజ్ ఎస్సై రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

26న ఖానాపూర్‌కు కేసీఆర్



నిర్మల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 26న సీఎం కేసీఆర్ ఖానాపూర్ రానున్నారు. ఈమేరకు శనివారం సీఎం టూర్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 2,3 తేదీల్లో నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో సీఎం సభలు పూర్తయ్యాయి.

లంచమిస్తేనే పని..!

- జిల్లాలో చాలా శాఖల్లో ఇదే కథ
- మొన్న 'పోలీసు'.. నిన్న 'రిజిస్ట్రేషన్'
- వారం వ్యవధిలోనే ఏసీబీ రెండోదాడి
- అవినీతిలోనూ దూసుకెళ్తున్న జిల్లా..



అక్టోబర్ 29న మామడ పోలీస్ స్టేషన్‌పై దాచేసిన ఏసీబీ అధికారులు



పట్టుకున్న నగదు

నిర్మల్: 'సార్.. నెలల నుంచి తిరుగుతున్నా.. కనీసం నా పని పట్టించుకోవడం లేదు. ఇంకెప్పుడు చేస్తరు సార్. ఎవరెవరికో చేస్తున్నరు. నన్ను మాత్రం రోజూ ఆఫీసుచుట్టూ తిప్పించుకుంటున్నరు. ఎందుకుసార్..' ఇది పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ బాధితుడి ఆవేదన. 'ఆ.. నువ్వు రాంగనే నీ పనిచేసి పెడతం బై. నువ్వేమైన మంత్రివా కలెక్టర్‌వా..? అయినా అన్ని పనులు ఉట్టిగనే చేస్తరా..? ఆ మాత్రం తెల్వదా..?' అని సదరు సారు చెబుతున్న ముచ్చట. అంటే.. పైసలు చేతుల పెడితేనే పని చేసి పెడతా.. అని చెప్పకనే చెబుతున్నారు. ఇలా ఈసారు ఒక్కరే కాదు. జిల్లాలోని చాలాశాఖల్లో చాలామంది సార్లు ఇలాగే ఉన్నారు. లంచావతారుల బాధ భరించలేక బాధితులు ఏసీబీని ఆశ్రయించినప్పుడు ఒక్కొక్కరు బయట పడుతున్నారు. వారం వ్యవధిలోనే జిల్లాలో ఇద్దరు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈలెక్కన జిల్లాలో లంచావతారులు ఏ స్థాయిలో ఉన్నారోనన్న చర్చ మొదలైంది.

ఏ పనికైనా పైసలే..

ఆ పని.. ఈ పని.. ఏ పనైనా పైసలిస్తేనే చేస్తున్నారు. ఎంతోకొంత ముట్టజెప్పితేనే సదరు పని తొందరగా పూర్తవుతోంది. లేదంటే.. నెలలపాటు వెయింటింగ్‌లో ఉండాల్సిందే. గ్రామపంచాయతీ నుంచి మొదలుకుని జిల్లాకేంద్రంలోని మున్సిపల్ దాకా ఇదే సంగతి. ఇంటి నిర్మాణానికి ఇచ్చే పర్మిషన్ నుంచి ఇంటిపన్ను వసూలు దాకా పైసలిస్తేనే ప్రశాంతంగా పూర్తవుతుంది. లేదంటే.. ఏదో ఒక కొండి.. వచ్చిపడుతూనే ఉంటుంది. కొన్నిశాఖల్లో ఖాళీ ఒక్క సంతకం పెట్టడం కోసం లంచమిస్తేనే.. అన్నట్లు మాట్లాడుతున్నారు.

కొన్నిశాఖల్లో మరీ..

ఏ శాఖ చూసినా ఏమున్నది గర్వకారణం.. అన్నట్లు అన్నింట్లో అవినీతి మరకలు కనిపిస్తున్నాయి. సర్కారు ఇచ్చే జీతాలతో ఈ జీవితాన్ని ఎలా నెట్టుకొస్తం బై.. అంటూ తమ తోటి వాళ్లనూ ప్రోత్సహించే బ్యాచులూ ఉన్నాయి. ఇక పైసల ముచ్చటకు సంబంధించిన శాఖల్లో నైతే లంచాలివ్వనిదే నెలలు గడిచినా ఫైళ్లకు కాళ్లు రావు. ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, రిజిస్ట్రేషన్, పోలీస్, ఫారెస్ట్, ఎక్సైజ్, ట్రెజరీ తదితర శాఖల్లో వసూళ్లపర్వంపై నిత్యం ఆరోపణలు వస్తూనే ఉంటాయి. కొన్నిశాఖల్లో ఇప్పటికీ నెలవారీ వసూళ్లు కొనసాగుతుండటం గమనార్హం. గతంలో ప్రభుత్వం ఇలాంటి నెలవారీ వసూళ్లదందాపై సీరియస్‌గా దృష్టిపెట్టింది. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ పలు కీలకశాఖలు వసూళ్లను మొదలుపెట్టాయి.

వరుస ఘటనలతో

వారం వ్యవధిలోనే..

జిల్లాలో అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ)కి లంచావతారులు పట్టుబడటం ఇదేం కొత్త కాదు. గతంలో చాలామంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నేరుగా డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. కానీ.. ఈసారి వారం వ్యవధిలోనే రెండుఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. అందులోనూ ఒకటి పోలీసుశాఖకు, రెండోది రిజిస్ట్రేషన్లకు శాఖకు చెందింది కావడం చర్చనీయాంశంగా మారింది. అక్టోబర్ 29న అంటే సరిగ్గా వారం క్రితం మామడ ఎస్సై స్టేషన్ బెయిల్ కోసం రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఇది జరిగి వారంకూడా కాకముందే శనివారం జిల్లాకేంద్రంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ పట్టుబడ్డారు. బాధితుడు తన తండ్రి భూమిని తన పేరిట గిఫ్ట్ డీడ్ తీసుకునే క్రమంలో రూ.8 వేలు డిమాండ్ చేయడంతో ఆయన ఏసీబీని ఆశ్రయించారు. జూనియర్ అసిస్టెంట్‌తోపాటు అందులో పనిచేసే ప్రైవేటు ఉద్యోగి ఇద్దరూ ఏసీబీకి దొరికిపోయారు. ఇలా వరుస అవినీతి చేపలు బయటకు వస్తుండటంతో మిగతా శాఖల్లోని లంచావతారులపైనా జిల్లాలో చర్చ మొదలైంది.

లంచావతారుల్లో టెన్షన్..

ఇక వారం వ్యవధిలో ఏసీబీ అధికారులు రెండుసార్లు దాడి చేయడంతో మిగతా శాఖల్లోని లంచావతారుల్లో టెన్షన్ మొదలైంది. చాలా రోజులుగా ఏసీబీ దాడులు లేవని, ఎన్నికల వేళ.. అధికారులకు స్వేచ్ఛ దొరికినట్లు ఉందని జిల్లా వాసులు చర్చించుకుంటున్నారు. ఎన్నికలు కోడ్ ముగిసే వరకు ఇంకా ఎన్ని రైడ్స్ జరుగుతాయో అని ఆందోళన చెందుతున్నారు. కాస్త జాగ్రత్తగా ఉండాలని లంచావతారులు సమాచారం షేర్ చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆలయాల్లో బీజేపీ అభ్యర్థి పూజలు



కొండగట్టులో రమేశ్ రాథోడ్ దంపతులు

ఖానాపూర్: బీజేపీ ఖానాపూర్ అభ్యర్థి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ దంపతులు శనివారం వేములవాడ, కొండగట్టు పుణ్యక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉట్నూర్‌లో నామినేషన్ ప్రక్రియ ఉండడంతో ముందుగా నామినేషన్ పత్రాలతో ఆయా ఆలయాల్లో పూజలు చేశారు. వారివెంట పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, నాయకులు బాశెట్టి శివ తదితరులు ఉన్నారు.

రాథోడ్ రమేశ్ నామినేషన్



నామినేషన్ వేస్తున్న రాథోడ్ రమేశ్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ బీజేపీ అభ్యర్థిగా రాథోడ్ రమేశ్ తన తొలిసెట్ నామినేషన్ శనివారం దాఖలు చేశారు. భార్య సుమన్‌రాథోడ్‌తో కలిసి రిటర్నింగ్ అధికారి జీవాకర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

ప్రలోభపెడితే ఫిర్యాదు చేయాలి

- ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటు
- నియోజకవర్గంలో 311 పోలింగ్ కేంద్రాలు
- ముథోల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి



భైంసాటౌన్: ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని, ఎవరైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే కంట్రోల్ రూం నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ముథోల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్.కోమల్‌రెడ్డి అన్నారు. ఎన్నికలకు ఏర్పాట్లు, నియమావళి అమలు, ప్రత్యేక బృందాలు, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర విషయాలపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు. ముథోల్ నియోజకవర్గంలో మొత్తం 311 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భైంసా పట్టణంలోని 148 నంబర్ పోలింగ్ కేంద్రంలో 1500లకు మించి ఓటర్లు ఉండడంతో, అదనంగా మరో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

- ఎన్నికల కోడ్ అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. కోడ్ అమలు పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు–3, వీడియో సర్వేలెన్స్ టీంలు –2, స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు–3 పనిచేస్తున్నాయి. ఈ ప్రత్యేక బృందాలు ఎన్నికల నియమావళి ఉల్లంఘించినవారిపై నిఘా పెడుతుంది. ఓటర్లకు నజరానాలు, డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటుంది.
- నియోజకవర్గంలో 311 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. వీటిని 31 సెక్టార్లుగా విభజించి, గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను సెక్టార్‌కు ఒకరిని నియమించాం. ఏడుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను సైతం నియమించాం. ఒక్కో పోలింగ్ కేంద్రంలో సరాసరిగా 780 ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంప్ ఏర్పాటు చేశాం. అలాగే కనీస వసతులు తాగునీరు, మూత్రశాలలు, నీడ సౌకర్యం, విద్యుత్, తదితర వసతులు కల్పిస్తాం.
- కుభీర్ మండలంలో 1 నుంచి 52 వరకు పోలింగ్ కేంద్రాలు, కుంటాల మండలంలో 53 నుంచి 73 వరకు అలాగే 85 ,86 కేంద్రాలు, నర్సాపూర్(జి) మండలంలో 74 నుంచి 84 వరకు, భైంసారూరల్‌లో 87 నుంచి 113 వరకు, అలాగే 133, 134 కేంద్రాలు, 159 నుంచి 174 వరకు కేంద్రాలు ఏర్పాటు చేశాం. భైంసా పట్టణంలో 114 నుంచి 132 వరకు, 135 నుంచి157 వరకు కేంద్రాలు, లోకేశ్వరం మండలంలో 175 నుంచి 212, ముథోల్ మండలంలో 213 నుంచి 247, బాసరలో 248 నుంచి 267, తానూర్‌లో 268 నుంచి 311 వరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.
- ఎన్నికల సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం సీ–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రలోభాలకు గురిచేస్తే ఆ వీడియోలు/ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. లేదా కంట్రోల్‌రూం నంబర్ 74168 90147కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

అవినీతి, దోపిడీ ప్రభుత్వాలను ఓడించాలి

- జస్టిస్ చంద్రకుమార్



బస్సు యాత్రలో పాల్గొన్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: అవినీతి దోపిడీ ప్రభుత్వాలను ఓడించాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. జాగో తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలను చైతన్యవంతం చేయడానికి చేపట్టిన ఓటర్ల చైతన్య బస్సు యాత్ర కార్యక్రమం శనివారం నిర్మల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ అడ్డూ అదుపు లేని అవినీతికి పాల్పడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల గుట్టగా, అత్యంత అవినీతి రాష్ట్రంగా మార్చారన్నారు. మోదీ ప్రభుత్వం మత విభజన విద్వేషాలతో బడా సంపన్నులు అయిన అదాని, అంబానీలకు సేవ చేస్తున్నారన్నారు. మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం విద్య వైద్య రంగాన్ని సర్వనాశనం చేసిందని, కల్వకుంట్ల కుటుంబం అధికారంలో ఉంటే ఉద్యోగాలు రావన్నారు. మరోసారి కేసీఆర్ అధికారంలోకి వస్తే తెలంగాణ సర్వనాశనం అవుతుందని హెచ్చరించారు. యాత్రలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక సలహాదారు వినాయక్‌రెడ్డి, నైనాల గోవర్ధన్, పద్మజాషా, మునీరుద్దీన్, నంది రామయ్య, కె.రాజన్న, పెద్దింటి రామకృష్ణ, ఎస్ఎన్.రెడ్డి, కె.లక్ష్మి, జె.రాజు, ఎం.బక్కన్న, కె.లక్ష్మి, హరిత, మహేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు



ఎన్నికల ప్రచారంలో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నవంబర్ 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నిర్మల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరేలా సహకరించాలని డీసీసీ అధ్యక్షుడు, ఆ పార్టీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ కాలనీ 22వ వార్డులో గడపగడపకూ ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీ స్కీంలను వివరించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అందరికీ అండగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన ఉద్యమకారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్లలో అన్యాయం చేశారన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో రాష్ట్రాన్ని సాధించుకుంటే అధికారంలోకి వచ్చిన కేసీఆర్ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ పాలనపై వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటువేసి రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని కోరారు.

కాంగ్రెస్ లో చేరిక...

సోన్ మండలం సోన్, నిర్మల్ మండలం ఎల్లారెడ్డిపేట్, రత్నపూర్ కాండ్లీ, గోపాల్‌పేట్, రాణాపూర్, సోనాపూర్ గ్రామలకు చెందిన పలువురు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సాద సుదర్శన్, భీమ్‌రెడ్డి , వేణు, శేఖర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కడెం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కర్నాటక ఎమ్మెల్సీ ప్రకాశ్‌రాథోడ్ తెలపారు. కడెం మండలం లింగాపూర్, ధర్మాజీపేట్, కడెంలో శనివారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన సుమారు 400 మంది ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందులో ఎంపీపీ అలెగ్జాండర్, సర్పంచ్ నరేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు వాజిద్‌ఖాన్, రహీం , సలీం, భూషణం, ఇస్రూ, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామారావ్‌పటేల్



రోడ్‌షోలో రామారావ్ పటేల్

తానూరు: తనకు ఒకసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి రామారావ్‌పటేల్ అన్నారు. మండల కేంద్రం తానూరులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మహాలక్ష్మి, హనుమాన్ ఆలయాల్లో పూజలు చేశారు. తర్వాత బీఆర్.అంబేద్కర్, అన్నబావుసాటే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హమీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో, కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలో వస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్ర పథకాలను వివరించారు. అనంతరం తానూరులో బీజేపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పలువురికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. బీజేపీ మండల నాయకులు శివాజీపటేల్, మోహన్‌రెడ్డి, చక్రధర్‌పటేల్, సోమ్‌నాథ్, చిన్నారెడ్డి, ఆయా గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పిన కేసీఆర్..

సీఎం కేసీఆర్ భైంసాలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల సభలో అబద్ధాలాడారని రామారావ్ పటేల్ ఆరోపించారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు ద్వారా 12 వేల ఎకరాలకు ఎక్కడ సాగునీరు అందుతో చూపించాలన్నారు. 5 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని తెలిపారు. తానూరు మండలంలో కాళేశ్వరం కాలువ నిర్మాణానికి నిధులు లేక కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారని తెలిపారు. బాసర ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ నిధులు రాలేదని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీలో సమస్యలు పరిష్కరం కాక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా సీఎం స్పందించలేదని తెలిపారు. గుండెగాం గ్రామానికి పునరవాస నిధులు మంజూరు కాలేదని పేర్కొన్నారు.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

- జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దిలావర్‌పూర్: జిల్లాలో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో ఆయిల్‌పాం సాగు చేయాలని, భవిష్యత్తులో ఆయిల్‌పాంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. దిలావర్‌పూర్‌లో రెండేళ్లుగా సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యానవన శాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి రెండేళ్ల క్రితం దిలావర్‌పూర్ గ్రామ శివారులోని తన వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పాం సాగు చేస్తున్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణలో ఆయిల్‌పాంపై అవగాహన లేని సమయంలో ఇక్కడ పంటను సాగు చేయడం అభినందనీయమన్నారు. దీంతో రైతులకు ఇప్పుడిప్పుడే వస్తున్న అవగాహన పొందుతున్నారని పేర్కొన్నారు. తగ్గిపోతున్న నూనెగింజల ఉత్పత్తి కారణంగా దేశంలో వంట నూనెలల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తున్నాయని వెల్లడించారు. ఆయిల్‌పాం సాగులో మెలుకవలు, చీడపీడలు, నీరు, పోషకాల యాజమాన్యం తదితర అంశాలను కోరమండల్ కంపెనీ ఉపాధ్యక్షుడు జీవీ.సుబ్బారెడ్డి వివరించారు. ఇందులో రిటైర్డ్ ఉద్యానవన శాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, ఆయిల్‌పాం కన్సల్టెంట్ బీఎస్.రావు, జోనల్ మేనేజర్ మనోజ్‌కుమార్, సీనియర్ అగ్రానమిస్టులు పాపిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సేల్స్ అధికారి కుమార్, వ్యవసాయాధికారి డి.రాజశేఖర్‌రెడ్డి, ఏఈవోలు శ్రీవాణి, శ్రీదేవి, వ్యవసాయ ఉత్పత్తుల విత్తన విక్రేతల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడాకారులుగా ఎదగాలి



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న పద్మ

నిర్మల్ రూరల్: విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా పరీక్షల అధికారి, మంజులాపూర్ పాఠశాల హెచ్ఎం పద్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంజులా పూర్ ఉన్నత పాఠశాలలో అండర్–14 వాలీబాల్ జిల్లా ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను పద్మ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి రమణారావు, పెటా ప్రధాన కార్యదర్శి భోజన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరాచక పాలనను అంతం చేయాలి

- బీజేపీ నిర్మల్ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



రోడ్ షోలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నర్సాపూర్(జి): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అరాచక పాలనను అంతమొందించాలని నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. మండలంలోని కుస్లీ, అంజనీతండా గ్రామాల్లో శనివారం ఉదయం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలకేంద్రంలో సాయంత్రం నిర్వహించిన రోడ్ షోలో సీఎం కేసీఆర్, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కేసీఆర్ దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, దళితబంధు పథకాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. నిర్మల్ నియోజకవర్గంలో మంత్రి అల్లోల డీవన్ పట్టాల పేరిట భూములు కబ్జా చేశారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక నిధులను కేటాయిస్తుందని ప్రజలు గమనించి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఒకసారి అవకాశం ఇస్తే అందరికీ అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, బీజేపీ మండల కన్వీనర్ అర్జున్‌ఠాకూర్, అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, మాలేపు సాయికృష్ణ, కోడె సుధాకర్, మైస విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీలు

ఆదిలాబాద్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలకు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ ప్రొఫెసర్ టి.సవిత జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5, 6వ తేదీల్లో కబడ్డీ, 6, 7వ తేదీల్లో బాస్కెట్‌బాల్ పోటీలు యూనివర్సిటీలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అర్హత ధ్రువీకరణ పత్రం, ఎస్సెస్సీ మెమో, ఇంటర్మీడియట్, ప్రీవియస్ ఇయర్ స్టడీ మెమో, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

పలువురిపై కేసు

ఎదులాపురం: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన పలువురు దుకాణదారులపై శనివారం కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై కలీం తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా రాత్రి పది గంటల తర్వాత దుకాణాలు తెరిచి ఉంచకూడదన్నారు. నిఖిల్, మహ్మద్ మాలిక్, జమీల్ ఖాన్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దుకాణదారులు, హోటళ్లు, పాన్‌షాప్‌ల యజమానులు రాత్రి పది గంటల అనంతరం దుకాణాలను తెరిచి ఉంచకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రూ.లక్ష పట్టివేత



పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

కుభీర్: మహారాష్ట్ర సరిహద్దులో మండలంలోని సర్వెల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రలోని పాలజ్ గ్రామం నుంచి భైంసా రూ.లక్షతో వస్తున్న రాజేశ్వర్ అనే వ్యక్తి పట్టుపడ్డాడు. నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు ఎస్సై ఎం డీ.షరీఫ్ తెలిపారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ద్యాగవాడ చౌరస్తా వద్ద ధర్మాన ఇంట్లో మద్యం బాటిళ్లు శనివారం పట్టుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అతని ఇంట్లో తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 62 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వీటి విలువ రూ.7 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

మళ్లీ కనిపించిన పులి



రిజర్వాయర్ క్యాంప్ సమీపంలో కనిపించిన పులి

- పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో సంచారం

తాంసి: భీంపూర్ మండలంలోని పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాల్లో పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. వారం క్రితం తాంసి(కె), గొల్లఘాట్, పిప్పల్‌కోటి శివారులో పులి సంచరించిన విషయం తెలిసిందే. వరుసగా పశువులపై దాడి చేసి వాటిని హతమార్చిన బెబ్బులి శనివారం సాయంత్రం తాంసి(కె), పిప్పల్‌కోటి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు సమీపంలోకి వచ్చింది. రాత్రి వేళలో స్థానిక రిజర్వాయర్ నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన క్యాంప్ సమీపంలో సంచరించింది. విషయాన్ని క్యాంప్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ రాహుల్ గుర్తించి మిగతా సిబ్బందిని అప్రమత్తం చేశాడు. పులిని సెల్‌లో ఫొటోలు తీసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హైమద్, బేస్ క్యాంప్ సిబ్బంది అక్కడికి చేరుకొని పులి సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు.

పులి దాడిలో ఆవుదూడ హతం

జైనథ్: మండలంలోని హట్టిఘాట్ పంప్‌హౌస్ వద్ద మేత మేస్తున్న ఆవుల మందపై పులి శనివారం దాడి చేసింది. ఈ ఘటనలో కోర్టా గ్రామానికి చెందిన నందెడపు బాపుకు చెందిన ఒక ఆవు దూడ మృతి చెందగా, అన్నెల లింగన్న, పాలెపు దేవన్నకు చెందిన రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆవుల మందను అన్నెల అశోక్, ఏముల విఠల్ హట్టిఘాట్ పంప్‌హౌస్ వైపు మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో మేత మేస్తున్న మందపై పులి ఒక్కసారిగా దాడిచేసింది. దీంతో ఆవులు భయంతో పరుగు తీశాయి. కొంత దూరంలో ఉన్న అశోక్, విఠల్ పులిని చూసి బిగ్గరగా కేకలు వేశారు. అప్పటికే పులి ఒక ఆవుదూడను చంపి నోట కరుచుకొని వెంట తీసుకెళ్లింది. ఈ దాడిలో మరో రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రైతులు లబోదిబోమన్నారు. తమకు పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఆశపడ్డాడు.. పట్టుబడ్డాడు..

- రూ.8వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్
- సహకరించిన ప్రైవేట్ అసిస్టెంట్ రాజు
- ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న అధికారులు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, ప్రైవేట్ అసిస్టెంట్ రాజు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ శనివారం దాడిచేశారు. దీంతో ఒక్కసారిగా అలజడి రేగింది. ఏసీబీ అధికారులు దాడితో సిబ్బంది ఉలిక్కిపడ్డారు. బాధితుడు తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట గిఫ్ట్ డీడ్ చేసేందుకు జూనియర్ అసిస్టెంట్ అరుణకుమార్ రూ.8 వేలు ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం చాక్‌పల్లి గ్రామానికి చెందిన సయ్యద్ కరీం తన తండ్రి పేరు మీద ఉన్న ఆస్తిని గిఫ్ట్ డీడ్ చేసుకునేందుకు గతనెల 31 న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాడు. సబ్ రిజిస్ట్రార్‌ను కలువగా జూనియర్ అసిస్టెంట్‌ను కలవమని చెప్పారు. దీంతో కరీం జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్‌ను కలిశారు. పని జరగాలంటే రూ.8 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కరీం ఈనెల 2న ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు కరీం శనివారం కార్యాలయంలో రూ.8 వేలు లంచం ఇస్తుండగా.. జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, ప్రైవేట్ అసిస్టెంట్ రాజును పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నామని ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. అరుణ్‌కుమార్ గతంలో కూడా స్టాంపుల అవకతవలక విషయంలో సస్పెండ్ అయినట్టు సమాచారం.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడెం: మండలంలోని లింగాపూర్, మాసాయిపేట్ గ్రామల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎనిమిది లీటర్ల గుడుంబా సీజ్ చేసి, 2200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రమేశ్ తెలిపారు.



పట్టుకున్న గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

గుడుంబా పట్టివేత...

దస్తురాబాద్: మండలంలోని మున్యాల తండా, ఎర్రగుంట, రేవోజీపేట, చెన్నూర్, బుట్టపూర్ గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించారు. 20లీటర్ల గుడుంబా, 2500లీటర్ల బెల్లం పానకం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రమేష్ తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది ముత్యం, నిరోషా, కల్పన, వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తలనొప్పి భరించలేక యువతి ఆత్మహత్య



వైష్ణవి మృతదేహం

సారంగపూర్: మండలంలోని పొట్య గ్రామానికి చెందిన అలుగొండ వైష్ణవి(17) తలనొప్పి బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుందని సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా సమస్యతో బాధపడుతోంది. చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడం, ఖరీదైన చికిత్స చేయించుకునే స్తోమత లేకపోవడంతో శనివారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వైష్ణవి తండ్రి దత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



లక్ష్మణ్ (ఫైల్)

నేరడిగొండ: అప్పు తీర్చేమార్గం లేక రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొందిడి గ్రామాని కి చెందిన జాదవ్ లక్ష్మణ్ (48) గతేడాది ప్రైవేట్‌గా దాదాపు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. పంట సాగుతో పాటు కొడుకు పెళ్లి, అలాగే ఇంటిని నిర్మించుకున్నాడు. తనుకున్న నాలుగున్నర ఎకరాల్లో సాగు చేసిన సోయా, మక్క పంటలు సరిగా పండకపోవడంతో చేసిన అప్పు తీర్చలేనని మనస్తాపం చెంది గత నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం



కొత్త మద్దిపడగలో ధ్వంసమైన వరిపంట

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెంది దుల్లె వెంకటేశ్ వరి పంటపై శుక్రవారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. మూడు ఎకరాలు సాగు చేస్తే, పందుల దాడిలో సుమారు ఎకరం మేర పంట ధ్వంసమైందని బాధిత రైతు తెలిపాడు. పగలు కోతులు, రాత్రిళ్ల వన్యప్రాణులతో నష్టపోతున్నామని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

కొలాం భాషను కాపాడాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్



నివాళులర్పిస్తున్న సచిన్, ఆదివాసీ నాయకులు

ఎదులాపురం: అంతరించిపోతున్న ఆదివాసీ తెగలు, వారి భాషలను కాపాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన కుమురం సూరు 26వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కుమురం భీంతో పాటు కుమురం సూరు ఆదివాసీల కోసం నిజాం ప్రభుత్వ దౌర్జన్యంపై పోరాడారన్నారు. అంతరించిపోయే స్థితికి చేరిన కొలాం భాషాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవులు, అర్జున్, మహేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, కిరణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలి

నిర్మల్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర, సాంకేతికతలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జేవీఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ డ్రామా ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని నాటికలు ప్రదర్శించారు. 'మానవజాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. మూఢ నమ్మకాలు మన జీవితాన్ని ఏ విధంగా ప్రభావం చేస్తాయో తద్వారా ఏరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో విద్యార్థులు వివరించారు. చిరుధాన్యాల ఆవశ్యకత వాటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి వచ్చే ప్రయోజనాలు, మానవ జీవితంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం యొక్క ఉపయోగం, ఆహార భద్రత అనే అంశాలపై విద్యార్థులు వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లాలోని 15 పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరిని డీఈవో రవీందర్‌రెడ్డి అభినందించారు. న్యాయ నిర్ణేతలుగా రాష్ట రిసోర్స్ పర్సన్ నారాయణవర్మ వ్యవహరించారు. ఇందులో సైన్స్ సమన్వయకర్త బచ్చు శ్రీనివాస్, జిల్లా పరీక్షల అధికారి పద్మ పాల్గొన్నారు.

ఎన్నికల నిఘా నేత్రాలు

- బోథ్ నియోజకవర్గంలో మూడు ప్రత్యేక వాహనాలు
- 24 గంటల పాటు పర్యవేక్షణ
- జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారుల కార్యాలయాలకు అనుసంధానం



ఇచ్చోడలో పర్యటిస్తున్న ఎన్నికల నిఘానేత్ర వాహనం

ఇచ్చోడ: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిఘా కట్టుదిట్టం చేసింది. తొలిసారిగా వాహనాలకు ప్రత్యేకంగా నిఘానేత్రాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఎన్నికల అధికారులు 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నారు. బోథ్ నియోజకవర్గంలో మూడు మండలాలకు ఒక వాహనం చొప్పున కేటాయించారు. మొత్తం మూడు వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రోజంతా తనిఖీ బృందాలతో పర్యవేక్షిస్తున్నారు. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో షిఫ్టులో సివిల్ పోలీసు అధికారితో పాటు కెమెరామెన్ అందుబాటులో ఉంటారు. వాహనానికి అమర్చిన సీసీ కెమెరా ద్వారా 50 మీటర్ల దూరంలో ఉన్న దృశ్యాలను చిత్రీకరించడంతో పాటు సౌండ్‌ను కూడా రికార్డు చేస్తుంది. వీటిని జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయాలకు అనుసంధానం చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎన్నికల సంఘం ఈ చర్యలు తీసుకుంటుందని వారు వెల్లడించారు.

జంగ్ తెలంగాణ

బజ్జీలు వేస్తూ.. ఓట్లు అడుగుతూ..



బోథ్: ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ ఓ హోటల్‌లో శనివారం ఇలా బజ్జీలు వేస్తూ ప్రచారం చేపట్టారు. అనంతరం వ్యాపారులు, దుకాణదారులను కలిసి ఓటు అభ్యర్థించారు.

గుర్రమెక్కి వచ్చేత్తపా..



అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముధోల్ బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ తానూరు మండలంలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గుర్రంపై ఎక్కి ఇలా కాసేపు ఓట్లు అడిగారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

– తానూరు

అసెంబ్లీ బరిలో గల్ఫ్ సంఘాల నేతలు

- ఆలిండియా ఫార్వార్డ్‌బ్లాక్ తరఫున ముగ్గురు..
- ఇండిపెండెంట్‌గా మరొకరు పోటీ



ఎన్నికల్లో పోటీ చేస్తున్న గల్ఫ్ కార్మిక నేతలు

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ కార్మిక సంఘాల నేతలు రానున్న శాసనసభ ఎన్నికల బరిలో నిలువనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీపడనున్నట్లు పేర్కొంటున్నారు. గల్ఫ్ కార్మికులకు సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉన్నట్లు ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల స్పష్టం చేశారు. భారత స్వతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తరఫున వేములవాడ నియోజకవర్గం నుండి గుగ్గిళ్ల రవిగౌడ్, కోరుట్ల నియోజకవర్గం నుంచి చెన్నమనేని శ్రీనివాసరావు, నిర్మల్ నియోజకవర్గం నుంచి స్వదేశ్ పరికిపండ్ల ఇప్పటికే బీఫారాలు పొందారు. సింహం గుర్తుతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మరోవైపు సిరిసిల్ల దొరికెన కృష్ణ అభ్యర్థిత్వాన్ని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పరిశీలిస్తోంది. సమీకరణాలు అనుకూలించకున్నా స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండనున్నట్లు కృష్ణ తెలిపారు.

డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు కార్యాలయంలో మాట్లాడారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాజుగూడా తండాను సందర్శించడం జరిగిందన్నారు. గత ఏడాది పారుబాయి అనే గిరిజన మహిళా పాపకి జన్మనిచ్చి మరణించిందని, 11 నెలలుగా జిల్లా న్యాయసేవా సంస్థ ద్వారా పాప బాగోగులు చూస్తున్నామన్నారు. నిత్యావసర సరుకులు, బట్టలు అందించడం జరిగిందన్నారు. అలాగే గ్రామానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అధికారుల సహకారంతో కృషి చేస్తామన్నారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోహర గ్రామంలో ఉచిత న్యాయ సేవ సదస్సు నిర్వహించామన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్రగతి



పురస్కార గ్రహీతలతో ఆర్ఎం, అధికారులు

- ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులంతా సమష్టి కృషితో ముందుకు సాగినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రీజినల్ లెవెల్ ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు సేవా దృక్పథంతో ఆలోచిస్తూ నిరంతరం అంకితభావంతో పని చేయాలన్నారు. సంస్థను లాభాల బాటలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన 28 మంది ఉద్యోగులకు పురస్కారాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే రీజియన్ పరిధిలో ఆదిలాబాద్ డిపో అగ్రస్థానంలో నిలవగా, డీఎం కల్పన ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. ఇందులో డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ ఉన్నారు.